విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

గురువారం 14 నవంబరు 2024 8 పేజీలు

డిసెంబర్‌లో సాంస్కృతిక యువజనోత్సవ పోటీలు

విశాలాంధ్ర-తిరుపతి: అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి, ఎఐటియుసి, ఏఐఎస్ఎఫ్, ఏఐయుఎఫ్ సంయుక్తంగా నేటి యువతరంలో కళల పట్ల అభిరుచిని పెంపొందించదానికి 2024 డిసెంబర్ 16, 17 తేదీలలో విజయవాడలో సాంస్కృతిక యువజనోత్సవ పోటీలను నిర్వహిస్తున్నామని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, 300 రూపాయలు విలువగల పుస్తకాలను బహుమతులుగా ప్రదానం చేస్తారు. ఈ పోటీలలో 18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు గల యువతీ యువకులు అర్హులని, పాల్గొన దలచిన కళాకారులకు ఎంపిక నవంబర్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలో గల గంధమనేని శివయ్య భవనంలో జరుగుతుంది. ఏకపాత్రాభినయం కాలపరిమితి 15 నిమిషాలు చారిత్రక, సాంఘిక పాత్రలు మాత్రమే నటించాలి. జానపద గేయాలాపన కాల పరిమితి 5 నిమిషాలు సినిమా పాటలు పోటీకి అనుమతించబడవు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన కళాకారులు తమ ఎంట్రీలను యువశ్రీ మురళి (అరసం) 9491312522. చిన్నం పెంచలయ్య.ప్రజానాట్యమండలి 9885228869.

- అద్దె గదులలో చిన్నారుల చదువులు
- పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు నిరాకరణ

అర్థాంతరంగా ఆగిన అంగన్వాడీ భవనాలు

<u>విశాలాంధ్ర-చిట్టమూరు:</u> మండలంలోని యకశిరి, ఉప్పలమర్తి గ్రామాల్లో 2018వ సంవత్సరం అప్పటి గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ చేతుల మీదగా శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించిన అంగన్వాడీ భవనాలు అసంపూర్తిగా మధ్యలోనే ఆగిపోయాయని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తెలుపుతున్నారు. గ్రామస్తుల వివరాల మేరకు 2018 సంవత్సరం యాకశిర పంచాయతీలో మూడు అంగన్వాడీ భవనా లు, ఉప్పలమర్తిలో ఒక అంగన్వాడీ భవనం ప్రభుత్వం నుండి మంజూరై పనులు చేపట్టడం జరిగిందని, ఒక్కో భవనానికి అంచనా విలువ 7 లక్షల రూపాయలుగా అప్పటి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మట్టాల వరకు భవనాలు పూర్తిచేసినా అప్పటి ప్రభుత్వం మారి వేరొక ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లకు వారికి రావలసిన బిల్లులు పూర్తిగా చెల్లించ కుండా కొంతమేరకు చెల్లించి బిల్లులను నిలుపుదల చేయడం పనులు పూర్తి చేసిన బిల్లులు ప్రభుత్వపరంగా రావని కాంట్రాక్టర్లకు సందేహం కలగడంతో అంగనవాడి భవనాలు మధ్యలోనే అర్థాంతరంగా ఆగిపోయాయి.

2

గరివిడి పశు వైద్య కళాశాల విద్యార్థులకు

న్యాయం చేయాలి

- అధ్యాపక ఖాళీలను సత్వరం భర్తీ చేయండి
- వీసీఐ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి
- యూనివర్సిటీ విసికి ఏపీ రైతు సంఘం విజ్ఞప్తి

విశాలాంధ్ర - తిరుపతి : విజయనగరం జిల్లా గరివిడి మొదటి బ్యాచ్ విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం లేకుండా వారికి న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. రామానాయుడు ,రైతుసంఘం నేత డాక్టర్ టి. జనార్ధన్‌లు పేర్కొన్నారు.. ఎపి రైతు సంఘం ఆధ్వార్యాన బుధవారం తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయ విసి డాక్టర్ జె వి.రమణ కు రామానాయుడు ,జనార్ధన్ లు వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరివిడి కళాశాల ప్రారంభించి ఐదు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయక పోగా, కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం తో నేడు మొదటి బ్యాచ్ విద్యార్థులు పరీక్షలు రాసేం దుకు ఆటంకం కల్గుతోందని పేర్కొన్నారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు అవసరమైన ఆచార్యుల పోస్టులు భర్తీ చేయక కాలయాపన చేయడం వలనే విద్యార్థులకు అన్యాయం జరుగు తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలనే సాకుగా చూపడం వలన మరింత ఆలస్యం జరుగుతుందని కనుక ప్రస్తుతం యూని వర్సిటీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకో వాలని కోరారు.

2

ఐఐటీ కాలేజి నుండి లాంకో ఫ్యాక్టరీ వరకు

60 అడుగుల రోడ్డుకు ప్రతిపాదనలు

- సిందేపల్లి గ్రామం నుండి రాచగున్నేరి వద్ద ఉన్న 400-220 కె.వి-132 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డుకు ప్రతి పాదనలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

- వార్త 2వ పేజీలో

రెవెన్యూ అంశాలపై...

తహశీల్దార్‌లు వెంటనే స్పందించాలి

- మ్యుటేషన్‌లు, వెబ్ ల్యాండ్ కరెక్షన్లను పరిష్కరించేలా చొరవచూపండి
- కోర్టు కేసులకు నిర్ణీత గడువులోపు కౌంటర్‌లు దాఖలు చేయండి: జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు: రెవెన్యూ అంశాలపై తహశీల్దార్‌లు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మంది రంలో చిత్తూరు,నగరి డివిజన్‌లకు సంబంధించిన ఆర్డిఓ లు, తహశీ ల్దార్లతో రెవెన్యూ సంబంధిత అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యా ధరితో కలసి సమీక్షించారు.

2

శ్రీవాణి నూతన కౌంటర్ ప్రారంభించిన టీటీడీ అడిషనల్ ఈవో

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: తిరుమలలో ఇచ్చే ఆఫ్ లైన్ శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపు ప్రక్రియను మరింత సులభతరం చేసినట్లు టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. గోకులం సమావేశ మందిరం వెనుక వైపు శ్రీవాణి దర్శన టికెట్ల నూతన కౌంటర్ ను ఆయన బుధవారం ఉదయం ప్రారంభించారు. కౌంటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వయంగా భక్తుల వద్ద వివరాలు తీసుకుని మొదటి టికెట్ ను కేటాయించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఈవో మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉన్న శ్రీవాణి కౌంటర్ క్యూలైన్లలో వర్షం పడినప్పుడు భక్తులు ఇబ్బంది పడటాన్ని గుర్తించి ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీవాణి భక్తులు ఇకపై ఎలాంటి అసౌకర్యం కలగకుండా టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

2

అంగన్వాడీ భవనాలు

(మొదటి పేజీ తరువాయి) దీంతో గ్రామా లలోని కాలనీ ఇళ్లను అద్దెకి తీసుకొని అంగన్వాడీ సిబ్బంది కాలనీ ఇళ్లలోని చిన్నారులకు చదువులు, ఆటపాటలు నేర్పుతుండడంతో కొంతమంది తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రా లకు పంపేందుకు నిరాకరిస్తున్నారు. ఆనాడు శంకుస్థా పనకు శిలాఫలకాలు వేసిన సునీల్ కుమార్ రెండవ పర్యాయం శాసనసభ్యులుగా గెలిచినా ఈనాటి ఎమ్మెల్యే ఈ భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయన చేతుల మీదుగా ప్రారంభో త్సవాలు జరపాలని, చిన్నారులకు పటిష్టమైన ప్రభుత్వ భవనాలు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ని కోరుతున్నారు.

న్యాయం చేయాలి

(మొదటి పేజీ తరువాయి) పక్క కళాశాలల నుండి అధ్యాపకులను పంపడం తాత్కా లిక ఉపశమనమే తప్ప, సమస్య శాశ్వత పరిష్కారం కోసం వెంటనే నూతన అధ్యాపక నియామకాలు చేపట్టాలని వారు కోరారు. అలాగే కళాశాలలో మౌలిక సదుపా యాలు ల్యాబ్‌ల నిర్మాణం చేపట్టి విద్యార్థులకు అందుబాటులోనికి తీసుకురావాలని కోరారు .లేనిచో విద్యార్థులతో కలుపుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమించాల్సి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విసి స్పందించి ప్రస్తుతం తిరుపతి,గన్నవరం నుండీ అధ్యాపకులను సర్దుబాటు చేశామని,,పదోన్నతుల ద్వారా మరి కొందరికి అవకాశం కల్పించామని, నూతన పోస్టులు భర్తీకి ప్రభుత్వ అనుమతులు కోరామని తెలిపారు.మౌళిక సదుపాయాలు మరో మాసంలో పూర్తవుతాయని ,విద్యార్థులకు ఇబ్బంది కల్గనీయమని రైతు సంఘం నేతలకు హామీ ఇచ్చారు.

నూతన కౌంటర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి) రోజుకు 900 టికెట్లను ఆఫ్ లైన్ ద్వారా కేటాయిస్తున్నట్లు తెలిపారు. గతంలో టికెట్ కేటాయింపునకు మూడు నుండి నాలుగు నిమిషాలు పట్టేదనీ, ప్రస్తుతం ఒక నిమిషంలో భక్తులకు టికెట్ కేటాయించేలా అప్లికేషన్ లో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఐదు కౌంటర్ల ద్వారా భక్తులు సులభతరంగా టికెట్లు కొనుగోలు చేయవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సిఇ సత్య నారాయణ, డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో సురేంద్ర, ఏఈవో కృష్ణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌లు వెంటనే స్పందించాలి

(మొదటి పేజీ తరువాయి) ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ కీలకమైనదని ప్రజలు ఎంతో నమ్మకంతో రెవెన్యూ అంశాల పరిష్కారం నిమిత్తం వచ్చే బాధితులకు సమస్యను బట్టి అప్పటికప్పుడే పరిష్కరించే అంశాల పై చొరవ చూపాలని, భూ వివాదా లకు సంబంధించి ఇరు పార్టీలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెవెన్యూ శాఖ లో సిబ్బంది కొరత ఉన్నదని, దీనిని అధిగ మించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నిర్ణీత గడువులోపు వెబ్ ల్యాండ్ కరక్షన్ లు, మ్యూటేషన్ ల సమస్యల నిమిత్తం అందే దరఖాస్తులను రికార్డుల ఆధారంగా క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం పరిష్కరించాల నన్నారు. రెవెన్యూ రికార్డులను సురక్షితమైన ప్రాంతం లో భద్రపరచాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడడంతో పాటు ప్రజలకు రెవెన్యూ శాఖ పై విశ్వాసం పెరిగేలా పని తీరు ఉండాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు రైతులకు అవసరమైన పత్రాలను వెంటనే అందించేలా కృషి చేయాలన్నారు. రీసర్వే పై అందే దరఖాస్తులను పరిష్కరించేందుకు , పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ షెడ్యూల్ మేరకు అర్జీదారులతో ప్రతి శనివారం హియరింగ్ లు నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా అందిన సమస్యలను విభజించుకుని సంబంధిత వి ఆర్ ఓ తో క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దారి సమస్యలు, శ్మశాన వాటిక ల ఆక్రమణలు, వివిధ ప్రభుత్వ సంబంధిత శాఖల ఆధీనం లో ఉన్న ఆస్తుల పరిరక్షణలో రెవెన్యూ శాఖ కీలకమని, ఆక్రమణల తొలగింపుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీరాజ్, విద్యా, వైద్య, ఇరిగేషన్, దేవాదాయ శాఖ, పంచాయతీ, మార్కెటింగ్ సంబంధిత శాఖల అధీనంలో ఉన్న భవనాలు, భూములు ఆక్రమణలకు గురైనప్పుడు రెవెన్యూ శాఖతో సంబంధిత శాఖలు సమన్వయం చేసుకుని వీటి తొలగింపునకు చర్యలు చేపట్టాలని సూచించారు. కోర్టు కేసులలో నిర్ణీత గడువులోపు కౌంటర్ లను దాఖలు చేయాలని, చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ఇందుకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేసుకుని ముందస్తుగా దాఖలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత అంశం గా తీసుకుని నిర్వహిస్తున్నదని, జిల్లా కేంద్రానికి వచ్చి అర్జీలు అందించిన సమస్యల పరిష్కారానికి సంబంధిత తహశీల్దార్ లు, అర్జీదారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ విఆర్ఏలు, విఆర్ఓలకు వారి విధులకు సంబంధించి డివిజన్ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు, తద్వారా వారి పని తీరును మెరుగు పరచేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ కె. మోహన్ కుమార్, చిత్తూరు, నగరి ఆర్డిఓ లు శ్రీనివాసులు, భవానీ శంకరి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, సర్వే శాఖ ఏడి జయరాజ్, సంబంధిత తహశీల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

కన్నలి ప్రతాప్ రెడ్డికి పితృ వియోగం



విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ నేత కన్నలి ప్రతాప్ రెడ్డికి పితృ వియోగం జరిగింది. కన్నలి ప్రతాప్ రెడ్డి తండ్రి కన్నలి వెంకటసుబ్బారెడ్డి బుధవారం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఈయన అంత్యక్రియలు గురువారం ఉదయం 10 గంటలకు పెద్దకన్నలిలో జరుగుతా యని కుటుంబ సభ్యులు తెలిపారు.

60 అడుగుల రోడ్డుకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర-తిరుపతి: ఏర్పేడు-వెంకటగిరి రోడ్డు (ఐఐటి కాలేజ్) నుండి లాంకో ప్యాక్టరీ వరకు మరియు సిందేపల్లి గ్రామం నుండి రాచగున్నేరి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఏర్పేడు మండల పరిధిలో ఉన్న లాంకో ప్యాక్టరీ మరియు రాచగున్నేరి వద్ద 400 /220 / 132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్లు ఏర్పాటు సంబంధించి శ్రీకాళహస్తి ఆర్‌డి బాను ప్రకాష్ రెడ్డి, విద్యుత్ శాఖ, ఎస్ఈ శ్రీనివాసులు రావ్, లాంకో ప్యాక్టరీ ఎక్టార్ దొరైరాజ్‌లతో కలసి క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ముందుగా ఏర్పేడు - వెంకటగిరి రోడ్డు, ఐఐటి కాలేజ్ నుండి లాంకో ప్యాక్టరీ వరకు 60 అడుగుల వెడల్పు రోడ్డు ఏర్పాటుకు లాంకో కంపెనీ వారు ప్రభుత్వాన్ని కోరారు. సిందే పల్లి గ్రామం నుండి రాచగున్నేరి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్డు ఏర్పాటుకు భూమిని కేటాయించాలని ఏ.పి.ట్రాన్స్‌కో ప్రభుత్వంను కోరారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ లాంకో కంపెనీ ప్రతి నిధులు, విద్యుత్, ఆర్‌బి, పంచాయతీ రాజ్, శ్రీకాళహస్తి ఆర్డీ ఓ, ఏర్పేడు మండల తహశీల్దార్‌లతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు ఏర్పాటు చేయుటకు అవసరమైన భూమిని పరిశీలించాలన్నారు. ఆర్‌బి. ఎస్ఈ, పంచాయతీ రాజ్ ఎస్ఈ, ఆర్‌డిఓ పరిశీలించి రోడ్డుకు ఏర్పాటుకు అవసరమైన భూమి, రోడ్లు ఏర్పాటుకి అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులకు చూచించారు. సిందేపల్లి నుండి శ్రీకాళహస్తికి లాంకో ఫ్యాక్టరీ ప్రక్కన వెళ్లే దారి సక్రమంగా లేదని, రాత్రి పూట వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, దారి పొడవునా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులకు కలెక్టర్ చూచించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ, డిఈ, ఏఈలతో కలసి రాచగున్నేరి వద్ద ఉన్న 400-220-132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లాంకో ఫ్యాక్టరీ ప్రతి నిధులు, ఏర్పేడు మండల తహశీల్దార్ భార్గవి, పంచాయతీరాజ్,ఆర్‌బి,విద్యుత్‌శాఖ డిఈలు, ఏఈలు తదితరులు ఉన్నారు.

రాత్రిపూట చెత్తకుప్పల తొలగింపు నిరంతరాయంగా చేపట్టాలి: కమిషనర్

విశాలాంధ్ర-తిరుపతి: నగరపాలక సంస్థ పరిధిలోని రాత్రి పూట చెత్త కుప్పల తొలగింపు, చెత్త సేకరణ నిరంతరాయంగా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో రాత్రి పూట చెత్త సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాణిజ్య సముదాయాలు, హోటల్స్, జన సమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాత్రిపూట చెత్త కుప్పల (జి.వి.పి.) తొలగింపు, సేకరణ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టు గా చేపట్టామని అన్నారు. ప్రస్తుతం పగటి పూట రెండు షిఫ్టుల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని అన్నారు. రాత్రి సమయంలో హోటల్స్, వాణిజ్య సముదాయాలు, జన సమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చెత్త వేస్తున్నట్లు గుర్తించామని అన్నారు. వీటిని శుభ్రం చేయడానికి రాత్రి 9 నుండి ఉదయం 4గంటల వరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఇందుకోసం 20 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఆరు మంది డ్రైవర్లు ఆరు వాహనాలు, ఆరు ట్రాక్టర్ల తో చెత్త కుప్పల తొలగింపు, చెత్త సేకరణ పనులు చేస్తున్నామని అన్నారు. త్వరలోనే రాత్రిపూట ప్రధాన వీధుల్లో స్వీపింగ్ పనులు చేపడతామని అన్నారు. హోటల్స్, రెస్టారెంట్ల వారు, ప్రజలు చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా తమ సిబ్బందికి ఇచ్చి నగర శుభ్రతకు సహకరించాలని కమిషనర్ అన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ నరసింహ ఆచారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

ఘాట్ రోడ్డులో అదుపుతప్పిన కారు - ఆరుగురికి స్వల్ప గాయాలు

విశాలాంధ్ర - చంద్రగిరి: భాకరాపేట ఘాటు రోడ్డులో మారుతి డిజైర్ కారు అదుపుతప్పి లోయలో పడిపోయినది. కర్ణాటక రాష్ట్రం,బళ్ళారి నుండి తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్న సమయంలో కారు అదుపు తప్పడంతో అందులో ప్రయాణిస్తున్న 6 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. వి.మోహన్ బాబు (45), వి. రేణుక (38), అనంతమ్మ (50) లకు స్వల్ప గాయాలయ్యాయి. వి.కిషోర్ బాబు (18) కు చెవి దగ్గర గాయమైనది. వి.వనిత (15) వి.మోక్షిత (11)లకు తల, కన్ను,ముక్కు దగ్గర దెబ్బలు తగిలాయి. కారు అదుపుతప్పడంతో వెనకనే వస్తున్న ఆటోలోని ప్రయాణికులు గమనించి పోలీసులకు తెలియజేశారు.ఈ సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ పి.ఎల్లప్ప, కానిస్టేబుల్ చిరంజీవి తన పోలీసు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ వాహనంలో తిరుపతి, రుయా ఆసుపత్రికి తరలించారు.

గృహప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

విశాలాంధ్ర - చౌడేపల్లి: తన ప్రియతమ అభిమాని గృహప్రవేశానికి మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు మండలంలోని 29ఏ చింతమాకులపల్లికి చెందిన మండల ఉపాధ్యక్షుడు నరసింహులు యాదవ్ నూతన గృహప్రవేశం చేశారు ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై నరసింహులు యాదవ్ దంపతులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాజీ ఎంపీపీలు కూరపర్తి అంజిబాబు రుక్మిణమ్మ వైసిపి నాయకులు పద్మనాభ రెడ్డి రవిచంద్రారెడ్డి రమేష్ ఓబుల్ రెడ్డి అల్తాఫ్ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రెస్ క్లబ్ కమిటీ నూతన సభ్యులకు జనసేన నాయకుల సత్కారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి వినుత. కోటా ఆదేశాలు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్ కావలి శివకుమార్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులు వై . కోటేశ్వర బాబు. ప్రధాన కార్యదర్శి పి. హరీష్ రాయల్. గౌరవ అధ్యక్షులు వీసీ వెంకటయ్య. నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు తోట. గణేష్, పట్టణ ఉపాధ్యక్షులు రవి కుమార్ రెడ్డి. జ్యోతి రామ్. పట్టణ ప్రధాన కార్యదర్శి గరిక సురేష్. పట్టణ కార్యదర్శి ఉదయ్, నాయకులు దినేష్, కొప్పాల. వెంకటేష్, ప్రేమ్. జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డిఆర్‌యుసి సిమెంబర్‌గా డా. సాకం కృష్ణమూర్తి

విశాలాంధ్ర - పాకాల: పాకాల మండలం ఈ పాలగట్టపల్లి గ్రామపంచాయతీ వరదప్ప నాయుడుపేటకి చెందిన డాక్టర్ సాకం కృష్ణమూర్తి సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్ డివిజ న్‌కు డిఆర్‌యుసిసి మెంబర్‌గా నియమితులైనట్లు తెలిపారు. ఆయన ప్రస్తుతం రియల్స్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిఆర్ యుసిసి మెంబర్‌గా రెండు సంవత్సరములు పనిచేస్తారని ఆయన తెలిపారు. ఈ సంద ర్భంగా డా.సాకం కృష్ణ మూర్తి మాట్లాడుతూ ఈ పదవిలో నియమించినందుకు సీని యర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్ మనోజ్‌కి కృతజ్ఞ తలు తెలియచేస్తున్నానని, తన బాధ్యతలను తన శక్తి మేరకు నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, స్నేహితులు, బంధువులు ఆయనకు అభినందనలు తెలియచేసారు.

సత్యవేడు మండలంలో కొనసాగుతున్న పశుగణన

విశాలాంధ్ర-సత్యవేడు: మండలంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగణన కొనసాగుతోంది. ఈనేపథ్యంలో సత్యవేడు పశుసంవర్ధక శాఖ ఏడి గోవిందరాజ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఇరుగుళం వెటర్నరీ డాక్టర్ దయాకర్ పర్యవేక్షణలో సంబంధిత ఎన్యుమేటర్లు ఇంటింటికి వెళ్లి అన్ని రకాల జంతువుల వివరాలను నమోదు ప్రక్రియ జోరందుకుంది. ఇందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని నీళ్లుతొట్టి కండ్రిగ గ్రామంలో ఎన్యుమేటర్ సైదుల్ల ఇంటింటికి వెళ్లి బర్రెలు,గొర్రెలు,మేకలు,కోళ్లు,పందులు,బాతులు,ఆవు, ఎద్దులు తదితర జంతు జాలాలకు సంబంధించి వివరాలను సేకరించి ప్రత్యేక పశుగణన యాప్లో నమోదు చేస్తున్నారు.అలాగే ఆరూరు గ్రామంలో ఎన్యుమేటర్ కోదండం,మదనంబెడు గ్రామంలో జ్యోతి కుమార్ తదితర ఎన్యుమేటర్లు వారి వారి పరిధిలో పశువులకు సంబంధించిన వివ రాలను సేకరిస్తున్నారు. దీంతోపాటు ప్రతి కుటుంబంలో సభ్యుల వివరాలను కూడా సేకరించడం జరుగుతుంది.ఈనేపథ్యంలో పశువుల గణన తీరును ఇరుగుళం వెటర్నరీ డాక్టర్ దయాకర్ పర్యవేక్షించారు.నవంబర్ 10వ తేదీ నుంచి ప్రారంభమైన పశుగణన 2025 ఫిబ్రవరి వరకు కొనసాగనుంది.

గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామారావు

విశాలాంధ్ర -చిత్తూరు : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామారావు పిలుపునిచ్చారు. చిత్తూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగ సమస్య అధికమైందని దీని ద్వారా యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు . నేడు రాష్ట్రంలో మత్తు పదార్థాల విక్రయాలు జోరు అందుకుందని, తద్వారా యువత చెడు మార్గంలో పయనిస్తున్న దని .రాష్ట్ర ప్రభుత్వం మత్తు విక్రాలను నియంత్రించడంలో వైపల్యం చెందినట్లు ఆరోపించారు. నిరుద్యోగ సమస్యపై యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే యువత ఉద్యోగాలకు ఎక్కడ వెళ్లాలని ప్రశ్నించారు.దేశంలో 50 శాతం కలిగిన మహిళలకు అన్ని రంగాల్లో హక్కులు కలిగే విధంగా పోరాటాలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అన్యాయాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అందరు పనిచేయాలని తెలిపారు ఈ సమావేశంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ మమత దేవి రెడ్డి యూత్ కాంగ్రెస్ చిత్తూరు జిల్లాఅధ్యక్షుడు కేశవరాజు.డీ సిసిఐ అధ్యక్షులు పోటుగారి భాస్కర్, చిత్తూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కీకరాయల్ ,అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన కోఆర్డినేటర్లు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి కొరకు గ్రామసభలు నిర్వహించండి : ఎంపీడీవో

జిపిడిపి ప్రణాళిక ద్వారా ఇది సాధ్యం: ఎంపీపీ

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నందు బుధవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక విధివిధానాలపై సమావేశం నిర్వహించడం జరిగినది. మండల ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల ఎంపీడీవో ప్రమీల రాణి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలు అబి. వృద్ధి చెందాలంటే గ్రామ సభలు నిర్వహించి గ్రామంలో అవసరమైన పనులు గుర్తించాలని సూచించారు. గతంలో ఈ విధానం లేనందువల్ల స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, మనది ప్రజాస్వామ్య దేశం అయినప్పటికీ ఉన్నత వర్గాల చేతిలోనే పెత్తనం ఉంటూ వచ్చిందని, మనకు తగిన టెక్నాలజీ లేనందువల్ల ప్రభుత్వ అధికారుల నుంచి మనలను పాలించే పాలకులు వరకు ఏం చేస్తున్నారో, ఏ నిధులు ఎలా ఖర్చవుతున్నాయో మనకు తెలిసేటటు వంటిది కాదు. కానీ 2018 ఆన్‌లైన్ విధాన వచ్చిన తరువాత అనేక మార్పులతో ప్రస్తుతం గ్రామాలకు సంబంధించిన నిధులు ఎంత వస్తున్నాయి దేనికి ఖర్చు పెడుతున్నారు ఎంత నిల్వ ఉంది ఇలా ప్రతి విషయాన్ని సామాన్య పౌరుడు దగ్గర నుంచి మన రాష్ట్ర పాలకుల వరకు ఎవరైనా ఎప్పుడైనా చూసుకునే సౌకర్యాన్ని కల్పించడం జరిగింది. మనలో ప్రతి ఒక్కరు ఈ అభివృద్ధిని చేరుకోవాలంటే ప్రతి పిల్లవాణ్ణి మంచి విద్యను అందించే విధంగా అందులోనే మానసిక వికాసం శారీరక దారుఢ్యం ఉండి మంచి పౌరులుగా విలువలతో కూడిన విద్య కావాలి అందుకు తోడ్పడే విధంగా మన గ్రామ పాఠశాల వాతావరణాన్ని కల్పించాల్సిన ఆవశ్యకత మనందరి మీద ఉంది. ఒకప్పుడు వడ్డీ వ్యాపారుల దగ్గర చేతులు కట్టుకునే మహిళలు ప్రస్తుతం సొంత కాళ్ళపై బ్యాంకుల ద్వారా రుణాలు పొంది అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తున్నారంటంలో అతిశక్తి లేదు. అదేవిధంగా అందరము కలిసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అందుకు కావలసిన సహాయ సహకారాలు మేమందరం అందిస్తామని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, అగ్రికల్చర్ ఏవో ప్రవీణ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, మల్లికార్జున్ రెడ్డి, వెళ్ళు మోహన్,ఎంపిటీసీలుసర్పంచులుఅధికారులు పాల్గొనడం జరిగింది.

కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంకు ప్రశంసాపత్రం

విశాలాంధ్ర-తొట్టంబేడు: ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలు అందించిన తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంకు రాష్ట్ర పాఠశాల విద్యా కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం కలెక్టరు డాక్టర్ వెంకటేశ్వర్ ప్రశంసా పత్రం అందజేశారు. అదేవిధంగా ఆయన్ను దుశ్శాలువతో సన్మానిం చారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం సేవలను కలెక్టరు కొనియా డారు. ఈకార్యక్రమంలో జిల్లావిద్యాశాఖాధికారికేవీయన్ కుమార్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

విశాలాంధ్ర- ఓజిలి: మండలంలో రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతున్నది. నాయుడుపేట మండలానికి చెందిన కొందరు ట్రాక్టర్ల యజమానులు రాత్రి వేళల్లో రాచపాలెం రోడ్డుమీదగా బాలాయపల్లి మండలం జయంపు మెదగా ఈ ఇసుక అక్రమ రవాణా దందా జరుగుతుంది. సంబంధిత అధికారులు స్పందించి రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచితే వీరు పట్టుబడే అవకాశం ఉందని పలువురు గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

రుగ్బీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి బాలస్వరూప్

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థి బాల స్వరూప్ రుగ్బీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.కడప జిల్లా అమలాపురం సిఎస్ఎస్ఆర్, ఎస్ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో నవంబర్ 9,10 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం లో రుగ్బీ అండర్ 14 బాయ్స్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిం చినట్టు స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాల హెచ్ఎం భారతి పేర్కొన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు వివిధ జిల్లాల నుండి ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలోలో పాల్గొన్నారు.ఈ క్రమంలో రుగ్బీ రాష్ట్రస్థాయి పోటీల్లో బాలస్వరూప్ విజయ పతాకం ఎదు రు వేసి జాతీయస్థాయి రుగ్బీ పోటీలకు ఎంపిక కావ డం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పిడి మురళి శిక్షణ ఇచ్చి సత్తా చాటిన విద్యార్థి బాల స్వరూపును హెచ్ఎం భారతి, పలువురు ఉపాధ్యా యులు అభినందించారు.

ఇళ్ల స్థలాలకై సచివాలయాల వద్ద ధర్నా

- సిపిఐ పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇవ్వాలని ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు పక్కా ఇళ్లకు ప్రభుత్వం మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సచివాలయాల వద్ద ధర్నా, వ్యక్తిగత అర్జీలు సమర్పణ పోరాట కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పై కార్యక్రమం కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గం కార్యదర్శి అంబాకం చిన్ని రాజ్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పేదలకు గ్రామాలలో ఒకటిన్నర సెంటు పట్టణాలలో ఒక సెంటు ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగింది. ఆ ఇంటి స్థలాలు కూడా గ్రామా లకు పట్టణాలకు సుదూర ప్రాంతాల్లో నివాసయోగ్యం కానీ స్థలాల్లో ఇవ్వడం జరిగింది. ఇప్పటికీ చాలామంది పేదలకు ఇళ్ల స్థలాలు చూపించలేదుని చిన్ని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే ఒక సెంటు ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం పేదలకు నివాసానికి ఏమాత్రం సరిపోదని అలాగే గృహ నిర్మాణానికి కేవలం రూ. 1.80 లక్షలతో బేస్ మట్టం కూడా వేయలేని పరిస్థితుల్లో ఇసుక కంకర సిమెంట్ ఇతర సామాగ్రి ధరలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో మేం అధికారానికి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాలు మూడు సెంట్లు పేదలకు స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. గృహ నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని ఇసక ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. అలాగే పేదల ఇల్లు నిర్మిస్తున్న చోట రోడ్లు విద్యుత్ తాగునీరు డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కమ్యూని స్టు పార్టీ డిమాండ్ చేస్తా ఉందని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వమే ఇనుము తదితర సామాగ్రిని సరఫరా చేయాలని, అలాగే పక్కా గృహానికి ఐదు లక్షల రూపాయలు మం జూరు చేయాలని చిన్ని రాజ్ డిమాండ్ చేశారు. పై కోర్కెల సాధనకు నవంబర్ నెల 18వ తేదీ సోమవారం సచివాలయాల వద్ద జరుగుతున్న ధర్నా వ్యక్తిగత అర్జీలు సమర్పణ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని చిన్ని రాజు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బుర్ర చంద్రశేఖర్, వరదయ్యపాలెం మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు దొడ్డి సిద్దులయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఖాతారి తరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు నాగార్జున, మురళి, సిపిఐ నాయ కులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: స్థానిక డీ.ఎం.పురం ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. హెచ్.ఎం కేశవులు క్రీడలను ప్రారంభించగా వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల రాజు కబడ్డీ, క్రికెట్, త్రో బాల్, సాఫ్ట్ బాల్, హ్యాండ్ బాల్, పరుగు పందెం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులను కమిటీ చైర్మన్ త్యాగ రాజు, వైస్ చైర్మన్ సంధ్యారాణి, గ్రామ పెద్దలు సోమ సుందరం పిళ్ళై, సుధాకర్, యుగంధర్ నాయుడు, వెంకటమునిని చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం రెడ్డి, వెంకటరమణయ్య, చిన్నయ్య చెట్టి, డిల్లి బాబు, రంజిత్ కుమార్, రాములు, హరి ప్రకాష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ రాజశేఖర్‌కి ఘన సన్మానం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోశాధికారి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జంతు శాస్త్రములో విభాగాధిపతిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్‌కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా బుధవారం జువాలజీ విభాగంలో రాజశేఖర్ ని ఏబిఆర్ఎస్ఎం తరపున సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో తన పైన మరింత బాధ్యత పెరిగిందని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధనా రంగాలలో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రాష్ట్ర ప్రభుత్వానికి పేరును ప్రతిపాదించిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధికారులకు, అవార్డుతో సన్మానించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రతినిధులు ప్రొఫెసర్ త్రిపుర సుందరి, డాక్టర్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ రంజని, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ వివేక్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ వెంకటసుబ్బయ్య, బాబు, మహేంద్ర, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికీ గాయాలు

విశాలాంధ్ర-పుంగనూరు: చిత్తూరు జిల్లా పుంగనూరు మండల సమీపంలో గల నరసాపురం గ్రామం వద్ద ఎదురు ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఎస్.వెంకటరమణ నర్సాపురం గ్రామానికి చెందిన వ్యక్తి త్రీవంగా గాయపడ్డాడు. చెంబకూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ పద్మసునంద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శ్రీరంగరాజపురం మండలం సీకే పురం అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్ (బీసీ-బీ) అలాగే కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్(బీసీ-బీ) ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. అర్హులైన వారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఇళ్ల స్థలాలకై సచివాలయాల వద్ద ధర్నాకు పిలుపు

విశాలాంధ్ర-రేణిగుంట: ప్రజా సమస్యల పైన పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 18వ తేదీన సచివాలయాల వద్ద ధర్నా, వ్యక్తిగత అర్జీల సమర్పణ పోరాట కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీలోని అల్లి మిట్టగ్రామములో ఇందుకు సంబంధించి కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జై తులసి రాజన్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పేదలకు గ్రామాలలో ఒకటిన్నర సెంటు, పట్టణాలలో ఒక సెంటు ఇచ్చిన ఆ ఇంటి స్థలాలు కూడా గ్రామాలకు పట్టణాలకు నివాసయోగ్యం కాని స్థలాల్లో ఇవ్వడం జరిగిందని చాలామంది పేదలకు ఇంటి స్థలాలు కూడా చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు మేము అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇస్తానని గృహ నిర్మాణానికి నాలుగు లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పై కోర్కెల సాధనకు ఈనెల 18వ తేదీన జరగబోవు ధర్నా వ్యక్తిగత అర్జీల సమర్పణ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జై తులసి రాజన్, అల్లిమిట్ట సిపిఐ గ్రామ కార్యదర్శి ఎస్ ఖాదరవల్లి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శంషాద్బి ఖాదర్ భాష, ఎస్.ఫాతిమా, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆకాశ దీపం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు కార్తీక మాసం సందర్భంగా 13వ రోజు సాయంత్రం శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణం లోని ఆకాశ దీప కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లకు కార్తీకమాస పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం 13వ రోజు సాయంత్రం శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఆకాశ దీప కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లోకేష్ రెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి కార్తీక పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలోని ఉప్పర పల్లి గ్రామపంచాయతీ సూరినేని వారి పల్లెలోని గురప్ప స్వామి ఆలయం నందు నేటి నుండి మూడు రోజులపాటు కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బుజ్జి బాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురప్ప స్వామి ఆలయం నందు విశ్వశాంతికై ప్రతి యేటా నిర్వహిస్తున్న 16వ సంవత్సర పూజ కార్యక్రమాలు గురువారం సాయంత్రం కలశ స్థాపనతో ప్రారంభమవుతా యన్నారు శుక్రవారం ఉదయం గణపతి పూజ, అనంతరం రుద్రాభిషేకం, బిల్వార్చన, శ్రీశ్రీశ్రీ లలితా పరమేశ్వరి దేవి లక్ష కుంకుమార్చన, అన్నాభిషేకం సాయంత్రం జ్యోతిర్లింగ సహస్ర దీపాలంకరణ తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. శనివారం ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, మధ్యాహ్నం లక్ష్మీ గణపతి హోమం, సుదర్శన హోమం, మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నా మన్నారు. కావున భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మాధవయ్య

విశాలాంధ్ర-పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పుత్తూరు రూరల్ మండలం గోపాలక్రిష్ణాపురం సచివాలయం నందు వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మాధవయ్య మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు సబ్సిడీపై వేరుశెనగ విత్తనకాయలు పంపిణీ చేపట్టడం జరుగుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవకు బడ్జెట్లో నిధులు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు ఏడీఈ ఆర్.రమేష్ రాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్.కోదండయ్య, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈ.మురళి, పుత్తూరు రూరల్ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వేపగుంట అరవ బాలాజీ, టీడీపీ నాయకులు బాలక్రిష్ణారెడ్డి, చిన్నా, గాలి బాబు, గంగాకుమార్, హరిగోపాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగులు సమ్మె నోటీసు

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా 108 ఉద్యోగుల నిరసనలో భాగంగా జిల్లా 108 ఉద్యోగుల సంఘ నేతలు బుధవారం సమ్మె నోటీసులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అందజేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించామని అందులో భాగంగా సమ్మెనోటీసును జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు జిల్లా 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివ, కమిటీ మెంబర్స్ కౌమల, కిరణ్, జ్ఞానసేకరన్, భాస్కర్ రెడ్డి లు తెలిపారు. సమ్మె నోటీసులను జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి కూడా అందజేసినట్టు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: నేటి తరానికి గ్రంథాలయాల ప్రాముఖ్యతను, విశిష్టతను మరియు గ్రంథాలయాల సేవలను తెలియజేసే విధముగా ఈ నెల 14 నుండి 20 వరకు స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద వున్న గ్రేడ్-1 గ్రంథాలయంలో మరియు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చెయడమైనది. ఈ నెల 14వ తేదిన గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15వ తేదిన పుస్తక ప్రదర్శన మదక ద్రవ్యాలపై అవగాహన 16 వ తేదిన గ్రంథాలయ ఉద్యమములో పాల్గొన్న వారిని స్మరించుకొనుట, 17వ తేదిన కవి సమ్మేళనము 18వ తేదిన విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించుట, 19 వ తేదిన గ్రంథాలయ వారోత్సవాలలో భాగముగా మహిళా దినోత్సవము, 20వ తేదిన డిజిటల్ గ్రంథలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయపఠనం, గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ప్రముఖులచే విద్యార్థులకు బహుమతులు ప్రదానము చేయుట మొదలగు కార్యక్రమములు నిర్వహించబడునని తెలియజేయడమైంది. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో, గ్రంథాలయాల ప్రాధాన్యం సామాజిక స్పృహ, విద్య ప్రాధాన్యతను చాటి చెప్పేలా ఈ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నాము. విద్యార్థిని, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వారికి వక్తృత్వపు పోటీలు, వ్యాస రచన, చిత్రలేఖన, పోటీలు నిర్వహించి వారికి బహుమతులు ప్రదానము చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తముగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, గ్రంథాలయ పాఠకులు ఈ 57 వ గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొని గ్రంథాయాల బలోపేతానికి దోహదపడాలని మరియు ఈ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతము చేయాలని కోరడమైనది.

ప్రమాదంలో గాయపడ్డామంటూ స్నేహితుడిని పిలిచి హత్యాయత్నం

విశాలాంధ్ర-పుంగనూరు: చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణానికి చెందిన ఏసుబాబు కుమారుడు రఫీకు (21) సంవత్సరాలను మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డామని ఫోన్ ద్వారా అతని స్నేహితులు రోషన్, ముబారక్, షా నవాజ్‌లు వెంటనే గూడూరుపల్లెకు రావలసిందిగా స్నేహితులు రఫీకును పిలిపించారు. రోడ్డు ప్రమాదంలో స్నేహితులు గాయపడ్డారని హుటాహుటిన బయలుదేరాడు. రఫీక్ రాగానే ముగ్గురు స్నేహితులు కత్తులతో రాడ్లతో అతి దారుణంగా దాడి చేయగ రఫీక్ చనిపోయాడని అక్కడి నుంచి స్నేహితులు పారిపోయారని, గూడూరుపల్లి గ్రామ సమీపంలో అనుమానస్పద స్థితిలో గాయాలతో పడివున్నా తనని గుర్తించి స్థానికులు 108 వాహనం ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రి తరలించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సివుంది.

కన్నలి వెంకట సుబ్బారెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ నాయకులు కన్నలి వెంకట సుబ్బారెడ్డి రెడ్డి భౌతిక కాయానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు కన్నలి ప్రతాపరెడ్డి, కన్నలి ప్రవీణ్ రెడ్డి తండ్రి కన్నలి వెంకటసుబ్బారెడ్డి స్వర్గస్తులయ్యారు. సమాచారం తెలుసుకున్న శాసనసభ్యులు వారి నివాసానికి చేరుకొని భౌతికకాయానికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జ రిషితా రెడ్డి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పోలీసులకు సవాలు విసురుతున్న దొంగలు

చంద్రగిరిలో వరస దొంగతనాలు.. బెంబేలెత్తుతున్న ప్రజలు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరిలో దొంగలు పోలీసులకు సవాలు విసురుతున్నారు. వరస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చంద్రగిరి ప్రశాంత్ నగర్లో దొంగతనం జరిగి రోజులు కాకముందే బుధవారం రాత్రి దొంగలు ఐతేపల్లె లోని చిల్లర దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఇదే తరహాలో నాగాలమ్మ మలుపు వద్ద గల ఓ ఫెర్టిలైజర్స్ దుఖాణంలో దొంగలు చొరబడి గల్లాలో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. మరోచోట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించారు. ఒకేరోజు వరసగా మూడు దొంగతనాలు చేస్తూ దొంగలు పోలీసులకు సవాలుగా మారారు. బాధితులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా మండలంలోని 21 పంచాయతీలలో సుమారు 64 వేల మంది జనాభా కలిగిన చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు 56 మంది సిబ్బంది ఉండవలసి ఉండగా ప్రస్తుతం కేవలం 33 మందే విధులు నిర్వహిస్తున్నారు. సెక్షన్ లో 10, కంప్యూటర్ 04, ఇండోర్ స్టాఫ్ 02, కోర్ట్ 03, రక్షక్ 02, బ్లూకోట్ 02, పనపాకం టోల్ ప్లాజా 04, రంగంపేట చెక్ పోస్ట్ 02, రామిరెడ్డిపల్లి 01, ఐడి పార్టీ 03 వారీగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. చాలినంత సిబ్బంది లేకపోవడంతో చంద్రగిరిలో గస్తీ నిర్వహించటం పోలీసులకు కష్టతరంగా మారింది. ప్రభుత్వం స్పందించి చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కు అవసరమగు సిబ్బందిని నియమించాల్సిందిగా ప్రజలు కోరుకొంటున్నారు.

రాష్ట్ర స్కూల్ ఆయమ్మల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా జయ కుమారి

విశాలాంధ్ర-పుత్తూరు: రాష్ట్ర స్కూల్ ఆయమ్మల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా జయ కుమారిని చిత్తూరు జిల్లా నుండి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని నగరి నియోజకవర్గం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ.కోదండయ్య ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరులో జరిగిన ఆయమ్మల రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పనిచేయు స్కూల్ ఆయమ్మల సమస్యల పైన చర్చించి వాళ్లు సమస్యలు పరిష్కరించే అదే విధంగా పోరాట కార్యక్రమం రూపొందించడం జరిగింది. భవిష్యత్తులో ఉద్యమాల్ని తీవ్రతరం చేయాలని కోరారు. జయ కుమారి ప్రధాన బాధ్యత తీసుకుని వారి సమస్యల పైన పోరాటం చేస్తూ నిరంతరం సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్నందున ఏఐటియుసి రాష్ట్ర నాయకత్వం ఆమెను రాష్ట్ర అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా స్కూల్ ఆయమ్మలా రాష్ట్ర అధ్యక్షురాలుగా ఎన్నుకోబడిన జయ కుమారి మాట్లాడుతూ నిరంతరం రాష్ట్ర జిల్లాస్థాయి నాయకత్వం ఇచ్చే పిలుపులను పాల్గొంటూ జిల్లాలో ఉన్న స్కూలు సమస్యల పైన నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. తన పైన నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర జిల్లా ఏఐటియుసి నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు ఏఐటియుసి చిత్తూరు జిల్లా సమితి తరపున శుభాకాంక్షలు తెలిపారు.

దాతృత్వాన్ని చాటుకున్న గివింగ్ హ్యాండ్స్

విశాలాంధ్ర-వాకాడు: మండల పరిధిలోని పల్లెపాలెం దళిత వాడికి చెందిన ఈదూరు వెంకట రమణయ్య అనే ఆటో డ్రైవర్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గత కొద్దిరోజుల క్రితం మరణించడంతో ఆ కుటుంబాన్ని గివింగ్ హ్యాండ్స్ సంస్థ దాతృత్వంతో వెంకట రమణయ్య సతీమణి సుజాతకి 10 వేలు రూపాయల నగదును సంస్థ కోశాధికారి జగదీష్ అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన కొంతమంది వ్యక్తులు కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కనీసం వైద్యం చేయించుకునేందుకు స్తోమత లేక ఇబ్బంది పడుతుండడం చూసి చెల్లించిపోయి గివింగ్ హ్యాండ్స్ అనే సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో కొంతమంది సభ్యులుగా చేరి ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు వారు సంపాదన లో కొంత నిధులు కేటాయించి సంస్థకి అందించడం ద్వారా పేద కుటుంబాలకు గివింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా సాయం అందించడం జరుగుతుందని జగదీష్ అన్నారు. 15 రోజులు పురిటి బిడ్డతో భర్తను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సుజాత కుటుంబానికి అండగా నిలిచిన గివింగ్ హ్యాండ్స్ సభ్యులను ఈ సందర్భంగా గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గివింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ తదితరులు ఉన్నారు.

18న జిల్లాలో సచివాలయాల వద్ద నిరసన

సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్.నాగరాజు పిలుపు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లాలోని అన్ని సచివాలయం వద్ద ఈనెల 18వతేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజ్ తెలిపారు. సిపిఐ నియోజకవర్గాల కార్యదర్శులు, పార్టీ శాఖ కార్యదర్శుల సమావేశం పార్టీ సీనియర్ నాయకులు కే.మని, విజయ కుమార్, అధ్యక్షతన బుధవారం చిత్తూరులో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేము అధికారం లోకి వస్తే పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆమె మేరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు జిల్లా వ్యాప్తంగా తల దాచుకోవడా నికి ఇండ్లు లేకుండా నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నప్పటికీ రాజకీయాల కారణంగా మంజూరు చేయకపోవడంతో నిరుపేదలు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కుల మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు జిల్లా వ్యాప్తంగా టిడ్కో గృహాలకు డిపాజిట్లు చెల్లించిన టీడ్కో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ చార్జీలను సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారం లేకుండా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగిరి పట్టణ కార్యదర్శి వి.వేలన్, పుంగనూరు పట్టణ కార్యదర్శి కె.రామమూర్తి, పలమనేరు, రామమూర్తి, పూతలపట్టు కే.విజయ్ గౌరి, చిత్తూరు దాసరి చంద్ర, ఏ.జమీలాభి, కే.రమాదేవి, బి. కుమారి, ఏ.కవిత, వి.కోమల, వి.దామోదరం, టిసి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'భవిత' కేంద్రానికి ప్రహరీ నిర్మించండి

- కలవగుంట భరత్ రెడ్డి

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం బసవయ్య పాలెంలో గల భవిత కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని ప్రముఖ సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి డిమాండు చేశారు. బసవయ్యపాలెంలోని భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ... భవిత కేంద్రానికి ప్రహరీ లేక పోవడం వలనే మంగళవారం పెద్ది లహరి అనే ఆరేళ్ల చిన్నారి కాలువలో పడి మృతి చెందిందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిత కేంద్రం పక్కనే ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఉన్నాయన్నారు. ఇక్కడ సుమారు 70మంది వరకు విద్యార్థులు ఉన్నారన్నారు. వీరికి కూడా ప్రహరీ లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇక్కడ పరిసరాలు కూడా చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. అధికారులు ఇకనైనా స్పందించి బసవయ్యపాలెంలోని భవిత, ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలకు ప్రహరీ నిర్మించాలని ఆయన కోరారు. ఈయన వెంట సర్పంచ్ భర్త శివశంకర్, భరత్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మున్సిపల్ సమావేశ హాలు సీలింగ్

విశాలాంధ్ర-నాయుడుపేట: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో నాయుడుపేట పట్టణంలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ సమావేశభవనం సీలింగ్ ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయింది. మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అంతకుముందు సమావేశంహాలులో మున్సిపాలిటీ పరిధిలో సచివాలయ శానిటరీ అధికారులు, పారిశుద్ధ్య వాహనాల డ్రైవర్లకు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశ సమయంలో సీలింగ్ కూలి అధికారులు, మున్సిపల్ సిబ్బందిపై పడి ఉంటే ప్రమాదం సంభవించేది. సమావేశ మందిరంలో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం జరగడంతో మున్సిపల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మాట్లాడుతూ వర్షానికి దెబ్బతిన్న మున్సిపల్ సమావేశం హాలు కొరకు నిధులను కేటాయించి తక్షణమే మరమ్మతులు చేపడతామని తెలిపారు.

పాత కక్షలతో మహిళపై దాడి

విశాలాంధ్ర-పుంగనూరు: పాత కక్షలతో ఓ మహిళపై దాడి చేసిన ఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పుంగనూరు మండలంలోని ఏతూరి గ్రామానికి చెందిన జ్యోతి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు పాత కక్షలతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

రైల్వే ప్రయాణికుల వసతులపై ఆరా

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు రైల్వేస్టేషన్‌ని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలాపల్లి రాంబాబు ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది. ఈ క్రమములో స్టేషన్ లోని బుకింగ్ ఆఫీస్‌లోని సూపర్‌వైజర్‌ను, సిబ్బందిని డ్యూటీ సంబంధించిన వివరాలు, డిజిటల్ లావాదేవీలు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. పలు ఆహార స్టాల్స్ తనిఖీ చేసి వాటి నాణ్యత, డేట్స్, రేట్ చూడడం జరిగింది. ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్, సంబంధించిన అధికారిని అడిగి తెలుసుకొని పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-పుంగనూరు: చిత్తూరు జిల్లా పుంగనూరు మండల పరిధిలోని కపాడం మిట్టపల్లి గ్రామానికి చెందిన శివరాజ్ భార్య శిరీష 35 సంవత్సరాలు కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు శిరీషను హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు వెలుగులో వచ్చింది. ఆమె పరిస్థితి బాగానే ఉంది.

ఉపాధ్యాయురాలు కామేశ్వరి ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వేలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కామేశ్వరి బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. కామేశ్వరి స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేలంపాడు నందు పనిచేస్తున్నారు. బుధవారం ఆకస్మికంగా మరణించినట్లు కుటుంబ సభ్యులు పత్రికాముఖంగా తెలియజేశారు. ఉపాధ్యాయురాలు కామేశ్వరి మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు, తోటి ఉద్యోగులు, విద్యార్థులు ఆమెకు శ్రద్ధాంజలి ఘటిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంగన్వాడి కార్యకర్తలు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

- క్షేత్రస్థాయిలో అంగన్వాడి వర్కర్, ఆశా, ఏఎన్ఎంలు సమిష్టిగా పనిచేయాలి: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ-చిత్తూరు: క్షేత్రస్థాయిలో అంగన్వాడీ వర్కర్, ఆశా, ఏఎన్ఎంలు సమిష్టిగా పని పనిచేయాలని తద్వారా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడంతోపాటు సకాలంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని ఈ దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సిడిపిఓ లను, సూపర్వైజర్ లను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంబంధించిన అంశాలపై సిడిపిఓలు సూపర్వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ శాఖలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయడం ద్వారా గర్భవతుల ఆరోగ్య సంరక్షణతో పాటు మాతా శిశు మరణాల నివారణ సులభతరమవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో స్థానికంగా ఉండే అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు వారి పరిధిలో గల గర్భిణీలు, బాలింతల ఆరోగ్య స్థితి గతులపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి అవసరమైన వైద్య సేవలతో పాటు పోషకాహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. హైరిస్క్ గర్భవతుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వారికి సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలను ఏఎన్ఎం, అంగన్వాడి వర్కర్, అంగన్వాడి సూపర్వైజర్లు రికార్డులను పక్కాగా నిర్వహించాలని, అంగన్వాడీ సూపర్వైజర్లు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహార పంపిణీని మాత్రమే పర్యవేక్షణ చేయకుండా ఆయా కేంద్రాల పరిధి లో గల గర్భవతులు వివరాలు వారి ఆరోగ్య స్థితిగతులు సంబంధిత అంశాలపై రికార్డులను పరిశీలించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని, బరువు తక్కువ గల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారికందించే ఆహార విషయమై వారి తల్లి దండ్రులకు తెలియ జేయాలన్నారు. ప్రతి పీహెచ్ సి పరిధిలో ఐసిడిఎస్ వైద్య ఆరోగ్యశాఖ సమన్వయ సమావేశం ఖచ్చితంగా నిర్వహించాలని తద్వారా సమస్యలను పరిష్కరించు కొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డిఎం హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి, జిల్లా స్త్రీ సంక్షేమ శాఖ అధికారి హైమావతి సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు 117 అర్జీలు

విశాలాంధ్ర-కుప్పం: కుప్పం నియోజకవర్గం లోని ప్రతి గ్రామ పంచాయతీ యొక్క సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వినూత్నంగా ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం చేపట్టిన "ప్రజా దర్బారు- మన పంచాయతీ వద్దకు మన ప్రభుత్వం" బుధవారం మొదటిగా కంగుంది గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుప్పం ప్రాంతీయ అభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పివిస్ మునిరత్నం, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజా దర్బార్- మన పంచాయతీ వద్ద కు మన ప్రభుత్వం కార్యక్రమం లో వివిధ శాఖలుకు సంబందిగించి 117 అర్జీలు వచ్చాయని కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కరించామని, మిగిలినవి త్వరితగతిన న్యాయం చేస్తామని కుప్పం ప్రాంతీయ అభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు.

తిమ్మాజీ కండ్రిగలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట మండలం తిమ్మాజీ కండ్రిగ సమీపంలో బుధవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభ వించింది. మంటలు చెలరేగి అట్ట ప్లేట్లను ఆహుతి చేశాయి. మంటలు అదుపులోకి రాకపోవ డంతో నాయుడుపేట అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం అందించారు. సమాచారం అందు కున్న నాయుడుపేట అగ్నిమాపక కేంద్ర ఇన్స్పెక్టర్ కె.శ్యాంబాబు తమ సిబ్బందితో కలిసి, హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శ్యాం బాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది గంట సేపుకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు. కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఉండవచ్చునని శ్యాంబాబు అభిప్రాయపడ్డారు. దాతల సహకారంతో తాము ఈ పరిశ్రమను నడుపుతున్నామని, సుమారు 5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు నిర్వాహకురాలు కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశారు. మంటల అదుపుకి తీవ్రంగా శ్రమించిన నాయుడుపేట అగ్నిమాపక సిబ్బంది రామకృష్ణ, చంద్రబాబు, శివకృష్ణ, సుబ్రహ్మణ్యంలను స్థానికులు ప్రశంసించారు.

సోమల మండలంలో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-సోమల: సోమల మండలంలో వ్యవసాయ అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు వ్యవసాయ మంత్రి రైతుల శ్రేయస్సు లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారని తెలియజేశారు. అనంతరం వరి, వేరుశెనగ పంటలలో యాజమాన్య పద్ధతులను మరియు పంటల సాగులో నాణ్యమైన అధిక దిగుబడులను సాధించంచడానికి పాటించాల్సిన మెళు కువలను రైతులకు తెలియజేశారు. వ్యవసాయ అధికారి రైతులకు వ్యవసాయ శాఖ తరపు నుండి ఏమేమి పనిముట్లు, విత్తనాలు కావాలి అడిగి నోట్ చేసుకోవడం జరిగింది. వరి పంట పొలాలను సందర్శించి పురుగులు, తెగుళ్ళు వాటి నివారణ చర్యలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రైతు సేవా కేంద్రం అధికారులు సుబ్రమణ్యం, రాధిక రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకం

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర అత్యంత కీలకమైనదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ కార్యాలయానికి తొలిసారిగా బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో సంభాషించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పాత్రికేయులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నిజాలను నిక్కచ్చిగా, వాస్తవాలకు తమ అభిప్రాయాలను జోడించకుండా ఉన్నదున్నట్లుగా చేరవేయడమే ఉత్తమ పాత్రికేయం అని చెప్పారు. ప్రభుత్వ విధానాల్లో ఏవైనా లోపాలంటే వాటిని ఎత్తిచూపిస్తూ మార్పులను సూచించాల్సిన బాధ్యత కూడా మీడియాపై ఉందన్నారు. ఇదే సమయంలో చిన్న చిన్న విషయాలను కూడా భూతద్దంలో చూపిస్తూ ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించడం సరికాదని పేర్కొన్నారు. ఈ సమాజంలో మనం కూడా భాగస్వాములమనే విషయాన్ని పాత్రికేయులు గుర్తుంచుకోవాలని చెప్పారు. పత్రికలు లేని ప్రజాస్వామ్యాన్ని ఊహించలేమని, మనిషి జీవిత విధానాన్ని, ఆలోచన క్రమాన్ని సరైన మార్గంలో పెట్టగల శక్తి పత్రికలకు ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోనే శ్రీకాళహస్తి జర్నలిజనానికి ప్రత్యేకమైన స్థానం ఉందని దానికి పరిరక్షించేలా ప్రస్తుత ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు ముందుకెళ్లాలని కోరారు. పట్టణ నడిబొడ్డులో పాత్రికేయులకు ఎంతో అనుకూలమైన చోట ప్రెస్ క్లబ్ కు నూతన కార్యాలయాన్ని కేటాయించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా ప్రెస్ క్లబ్ సొంత భవనానికి స్థలం కేటాయించడంతో నిర్మాణానికి కూడా తనవంతు సహాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం శుభపరిణామంగా పేర్కొన్నారు. తనవంతు ప్రెస్ క్లబ్ సంక్షేమానికి సహాసహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ ఉందుంటానని తెలిపారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఘనంగా సత్కరించారు. ఇటీవల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రెస్ క్లబ్ కు తొలిసారి విచ్చేసిన కోలా ఆనంద్ కు కార్యవర్గ సభ్యులు ఘనంగా ఆహ్వానం పలికారు. మీడియా ప్రతినిధులతో సంభాషణ అనంతరం ఆయన నూతన కమిటీ సభ్యులను సత్కరించి సన్మానించారు. అనంతరం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు కూడా కోలా ఆనంద్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వ్యక్తులపై కేసులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మోటారు సైకిల్‌ని రోడ్డుకు అడ్డంగా పెట్టి వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న ఏడుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐ గోపి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేది మధ్యాహ్నం 2 గంటల సమయంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఒక వ్యక్తి రామసేతు బ్రిడ్జి పక్కన గల రవి మెస్ వద్ద మోటార్ సైకిల్ వాహనములను నిలిపి రోడ్డుకి అంతరాయం కలిగిస్తున్నారని సోషల్ మీడియా ద్వారా సమాచారం వచ్చిందన్నారు. ఈ విషయంపై వెంటనే పోలీసులు స్పందించి దానికి కారుకులైనటువంటి వ్యక్తులపైన టౌన్ న్యూసెన్స్ యాక్టు కింద ఏడుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని, అనంతరం అక్కడ బారికేడ్స్ ఏర్పాటు చేసి అక్కడున్నటువంటి వాహనములన్ని తొలగించినట్లు సిఐ తెలిపారు. వాహన రాకపోలకు ఎవరైనా అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాహిత్య అధ్యయనం ద్వారా ఉత్తమ పౌరులుగా రాణించగలరు

విశాలాంధ్ర-తిరుపతి: సాహిత్య అధ్యయనం ద్వారా విద్యార్థులు ప్రపంచ జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా రాణించగలరని కవి, కథారచయిత పేరూరు బాలసుబ్రమణ్యం అన్నారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బుధవారం ఇటీవల ప్రచురించబడిన తన మడకెద్దుల కథల సంపుటిని విద్యార్థినులకు పరిచయం చేసి కథా రచన గురించి చర్చా గోష్టి నిర్వహించారు. రచయిత మాట్లాడుతూ తన చుట్టూ వున్న జీవితమే తన కథా వస్తువని అన్నారు. చిత్తూరు మాండలిక భాషలో రచించినటువంటి ఈ కథలు పలువురి మన్ననలను పొందాయన్నారు. స్త్రీల జీవితంలోని బాధలను, రైతుల కష్టాలను ఈ కథల రూపంలో అందించానన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.కృష్ణవేణి మాట్లాడుతూ రచయితలతో ముఖాముఖి కార్యక్రమం వల్ల రచనలు చేయాలనే కుతూహలం విద్యార్థినులకు కలుగుతుంద న్నారు. ఈ సందర్భంగా రచయిత 150 మంది విద్యార్థినులకు ప్రముఖ రచయిత నామిని సినబ్బ కథల పుస్తకాలను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్. కస్తూరి, డాక్టర్ శోభ, డాక్టర్ అన్నమ్మ, వృక్షశాస్త్ర అధ్యాపకులు జ్ఞాన ప్రసూన పాల్గొన్నారు.

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలి: ఎంఈఓ

విశాలాంధ్ర-పలమనేరు: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ఖచ్చితంగా మెనూను అనుసరించి విద్యార్థులకు భోజనం పెట్టాలని మండల విద్యాశాఖ అధికారికారిణి పి.లీలారాణి అన్నారు. బుధవారం పట్టణంలో గవర్నమెంట్ హై స్కూల్, ఉర్దూహైస్కూల్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపిపి సౌత్ పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో మంచి పోషకాహారం ఉంది కావున ప్రతి ఒక్క పాఠశాల విద్యార్థులు బాగా భోజనం చేసే విధముగా క్వాలిటీ, క్వాంటిటీ ని అనుసరించాలని సూచించారు.

15న ఊంజల సేవ: ఇఓ బాపిరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్ల ఊంజల సేవ కార్యక్రమం ఈ నెల 15వ తేదిన నిర్వహించనున్నట్లు ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఈనెల 15వ తేది శుక్రవారం రాత్రి 7:30 గంటలకు పౌర్ణమి సందర్భంగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్ల ఊంజల సేవ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావున భక్తాదులెల్లరూ ఈ ఊంజల్‌సేవ కార్యక్రమంలో పాల్గొని శ్రీస్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

తండ్రీకొడుకులకు ఐదేళ్ల జైలు శిక్ష

విశాలాంధ్ర-తిరుపతి: ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా తిరుపతి సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా శ్రీనివాస్ పర్యవేక్షణలో బాలి రెడ్డి మార్గనిర్దేశంలో గతంలో నమోదై కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధతీసుకొని ప్రాసిక్యూషన్ ద్వారా కోర్టులో సదరు కేసులలో పకడ్బందీగా సాక్షాదారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడేవిదంగా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. అందులో భాగంగా తీంద్రగుంట రిజర్వు ఫారెస్ట్ తిరుపతి డివిజన్ కరకంబాడి బీటు కృష్ణాపురం సెక్షన్లో పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలు అయిన తోట చిన్న చెంగయ్య, తోట చెంగయ్య తండ్రికొడుకులు. ముద్దాయిలను కోర్ట్ తిరుపతి జడ్జి నరసింహ మూర్తి వారి ఇద్దరికి 5 సంవత్సరములు జైలు శిక్ష మరియు రూ. 6 లక్షలు జరిమానా విధించడం జరిగినది. తదుపరి కోర్ట్ ఆదేశాల మేరకు ముద్దాయిలను నెల్లూరు సెంట్రల్ జైలునందు అప్పగించడం జరిగింది.

రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సి.షణ్ముగం రెడ్డి

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటీకి 1వ వార్డ్ మిట్టపల్లూరు చెందిన తెదేపా చిత్తూరు పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడు సి.షణ్ముగం రెడ్డికి నగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సిఫారసు మేరకు రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు బాధ్యతలు అప్పగించింది. పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడిగా ఉన్న ఆయన గతంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసినందుకుగాను ప్రభుత్వం ఆయనను గుర్తించి ఈ పదవీ బాధ్యతలు అప్పగించింది. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు సి.షణ్ముఖ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-చంద్రగిరి: ఉచితంగా వైద్య ఆరోగ్య పరీక్షలు ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ విశ్రాంతి ఉద్యోగుల సంఘం వారి ఆధ్వర్యంలో అమర హాస్పిటల్ తిరుపతి వారి సహకారంతో ఒకరోజు చంద్రగిరి గ్రామ పరిసరాల ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ లోకేష్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ మోహన్, ఆర్థోపెడిక్ డాక్టర్ రవికుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అనుకూలంగా రాష్ట్ర బడ్జెట్

- రాష్ట్ర ప్రజలకు పూర్తి ఆమోదయోగ్యంగా బడ్జెట్
- మౌళిక వసతులకు పెద్దపీట
- నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

విశాలాంధ్ర-పుత్తూరు: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా శాసనసభలో బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు, అలాగే అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజల ఆమోదయోగ్యంగా ఉందని చెప్పారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, వైసీపీ ప్రభుత్వ చేతగాని పాలనతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో అస్తవ్యస్తమైన వ్యవస్థలను గాడిలో పెడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యతయుతంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేదల కోసం బడ్జెట్లో విద్యా, వైద్యానికి పెద్దపీట వేశామని తెలిపారు. 2.94 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్లో వెనుకబడిన వర్గాలకు, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మీద దృష్టిసారించిన ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖకు 16 వేల 739 కోట్ల రూపాయలు కేటాయించిందని, అలాగే రోడ్ల అభివృద్ధికి 9554 కోట్ల రూపాయలు కేటాయించారని చెప్పారు. విద్యా వ్యవస్థలో నూతన మార్పులు తీసుకొచ్చే విధంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేసిన కూటమి ప్రభుత్వం 30 వేల కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించిందని తెలిపారు. మహిళా, శిశు సంక్షేమం కోసం 4280 కోట్ల, ఎస్సీల సంక్షేమం కోసం 18,497 కోట్ల రూపాయలు, ఎస్టీల అభివృద్ధి కోసం 7557 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజారంజక బడ్జెట్ రూపొందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి తన హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

'స్వర్ణాకృతి'ని ప్రారంభించిన మలబార్ గోల్డ్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: నవంబర్ 2024 : ప్రపంచంలోనే అతిపెద్ద మరియు అత్యంత విశ్వసనీయమైన బంగారు మరియు వజ్రాభరణాల రిటైల్ చెయిన్లలో ఒకటైన మలబార్ గోల్డ్ - డైమండ్స్, ఎంతో ప్రత్యేకమైన కొత్త సేకరణ 'స్వర్ణాకృతి'ని షోరూములో 2024, నవంబర్ .వ తేదీన ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరుకాగా, మలబార్ మానేజ్మెంట్ బృందం, స్టోర్ హెడ్, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. భారతదేశం యొక్క గొప్ప వారసత్వాన్ని సమకాలీన డిజైన్లతో అందంగా సమ్మిళితం చేసి, తయారు చేసిన సున్నితమైన బంగారు ఆభరణాల సేకరణలను ఈ క్లాసిక్ క్యూరేషన్ ప్రదర్శిస్తుంది. అత్యంత నైపుణ్యం కలిగిన హస్తకళా నైపుణ్యం కలిగిన స్వర్ణకారులచే, కళాత్మకత మరియు నైపుణ్యం కలబోసి రూపొందించబడిన అద్భుతమైన ఈ సేకరణను, ప్రింట్ మరియు టెలివిజన్‌లో ప్రదర్శిస్తూ, తమ ప్రచారానికి శ్రీకారం చుడుతోంది. కాలానికి అతీతమైన గాంభీర్యాన్ని, శక్తిని మూటగట్టుకుని, సంప్రదాయం మరియు ఆధునికతలను సమతూకం చేసుకుంటూ తమ ప్రయాణం కొనసాగిస్తున్న మహిళలకు ఈ 'స్వర్ణాకృతి' ఒక ప్రతీక. తరతరాలుగా చెప్పుకుంటున్న భారతదేశ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, ఈ ఆభరణాల్లోని ప్రతి భాగం చక్కగా చేతితో తయారు చేయబడింది, ఇందులో క్లిష్టమైన నమూనాలు, సున్నితమైన ఫిలిగ్రీ మరియు సవివరణాత్మకంగా అలంకరించబడి ఉంటాయి. సౌందర్యం మరియు గత వైభవం యొక్క సమ్మేళనాన్ని ఇష్టపడే మహిళల కోసం రూపొందించబడిన ఈ 'స్వర్ణాకృతి' ఆభరణాలను వారి స్వీయగాథల్లో భాగం చేసుకోడానికి స్వాగతిస్తుంది. 'స్వర్ణాకృతి' శ్రేణి ప్రారంభోత్సవం సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ మాట్లాడుతూ, "హస్తకళలతో తయారు చేసిన ప్రతి 'స్వర్ణాకృతి' బంగారు ఆభరణంతో, అందంతో పాటు, వారసత్వాన్ని మరియు గాంభీర్యాన్ని వేడుకగా జరుపుకుంటాము. ఆధునికతను ఆలింగనం చేసుకుంటూ సంప్రదాయాన్ని మెచ్చే మహిళలకు ఈ సేకరణ ఒక నివాళి. మా కస్టమర్లకు మలబార్ గోల్డ్ - డైమండ్స్ పట్ల ఉన్న నమ్మకాన్ని నిలబెట్టడమే కాకుండా, నాణ్యత, పారదర్శకత మరియు విలువకు సంబంధించిన మా వాగ్దానాన్ని 'స్వర్ణాకృతి' ప్రతిబింబిస్తుంది" అన్నారు. స్వచ్ఛతకు హామీ ఇచ్చే హాల్‌మార్క్ సర్టిఫికేషన్‌తో, అధీకృత బంగారాన్ని కస్టమర్లకు అందించడానికి మలబార్ గోల్డ్ - డైమండ్స్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. అంతేకాకుండా, బాధ్యతాయుతమైన మూలాల నుండి మాత్రమే సేకరించిన బంగారంతో మాత్రమే ఆభరణాలు తయారు చెయ్యబడతాయని బలంగా చెబుతుంది మరియు తమ సరసమైన ధరల విధానానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది, ప్రతి ఆభరణానికి న్యాయమైన తరుగు ఛార్జీలను మాత్రమే నిర్ధారిస్తుంది, ఇందులో నాణ్యత మరియు నైపుణ్యం ప్రతిబింబిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని మలబార్ గోల్డ్ - డైమండ్స్ షోరూముల్లో 'స్వర్ణాకృతి' సేకరణలు అందుబాటులో ఉన్నాయి. తాజా సమర్పణ యొక్క వారసత్వం, కళాత్మకత మరియు శ్రేష్ఠత పట్ల మలబార్ యొక్క నిబద్ధతను తెలుసుకోడానికి, తమకు సమీపంలోని షోరూముని సందర్శించడానికి స్వాగతిస్తున్నాం. ఆన్‌లైన్ లో అన్వేషించడానికి మరియు అదనపు సమాచారం కోసం సందర్శించవచ్చు. మలబార్ గోల్డ్ - డైమండ్స్ 1993లో స్థాపించబడిన మలబార్ గోల్డ్ - డైమండ్స్, భారత దేశంలో వైవిధ్యభరితమైన ప్రముఖ వ్యాపార సమ్మేళనం మలబార్ గ్రూప్ యొక్క ప్రధాన సంస్థ. 6.2 బిలియన్ డాలర్ల వార్షిక టర్నోవర్‌తో, ప్రపంచ వ్యాప్తంగా 6వ అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్ గా స్థానం సంపాదించింది. డెలాయిట్ లగ్జరీ గూడ్స్ వరల్డ్ ర్యాంకింగ్‌లో 19వ ర్యాంక్ సైతం పొందింది. భారతదేశం, మిడిల్ ఈస్ట్, ఫార్ ఈస్ట్, కెనడా మరియు ఆస్ట్రేలియా వంటి 13 దేశాలలో కార్యాలయాలు, డిజైన్ కేంద్రాలు, హోల్‌సేల్ యూనిట్లు మరియు ఫ్యాక్టరీలతో పాటు, 360 షోరూములతో బలమైన రిటైల్ నెట్‌వర్క్ తో విస్తరించింది. కస్టమర్లు తమకు ఇష్టమైన ఆభరణాలను, ఎప్పుడైనా ఎక్కడి నుండైనా వారి ఇళ్ల నుండే కొనుగోలు చేసే అవకాశాన్ని అందిస్తుంది మలబార్ గోల్డ్ - డైమండ్స్ ఆన్‌లైన్ స్టోర్ www.malabargoldanddiamonds.com స్వతంత్ర మరియు ఆధునిక మహిళలకు అధునాతన మరియు తక్కువ బరువున్న ఆభరణాలను అందించే రిటైల్ కాన్సెప్ట్ ఎం.జి.డి-లైఫ్‌స్టైల్ జ్యువెలరీ పేరుతో వివిధ డిజైన్లు మరియు సేకరణలను అందిస్తుంది. మలబార్ గ్రూపు ప్రారంభించినప్పటి నుండి కార్పొరేట్ సామాజిక బాధ్యత అనేది ఒక ప్రాథమిక నిబద్ధతగా పాటిస్తుంది. సంస్థ యొక్క ప్రధాన వ్యాపార కార్యకలాపాల్లో పర్యావరణ, సామాజిక - పాలన సూత్రాలను సమగ్రంగా అమలుపరుస్తుంది. మలబార్ గ్రూప్ యొక్క సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆరోగ్యం, గృహనిర్మాణం, ఆకలి లేని ప్రపంచం, విద్య, పర్యావరణం మరియు మహిళా సాధికారత ముఖ్యాంశాలుగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కస్టమర్లు మరియు పీకే రిజిష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

26న జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ 26న జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గడపగడపకు కరపత్రం, గ్రామ గ్రామానికి బైక్ ర్యాలీ, మండల, నియోజకవర్గ కేంద్రాలలో జీపు జాత ద్వారా విస్తృత ప్రచారం, నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల స్టీరింగ్ కమిటీ నాయకులు తెలిపారు. ఈ నెల 6వ తారీకు జరిగిన సన్నాహక సమావేశంలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా కార్మిక సంఘాల నాయకులు, ఏఐటీయూసీ నుండి కే.రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు నుండి జి.బాలసుబ్రమణ్యం, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, ఐఎఫ్టియు నాయకురాలు జి.భారతి, రైతు కూలీ సంఘం నాయకులు రామిశెట్టి వెంకయ్య, రమణయ్య, 9 మంది స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈనెల 15వ తేదీ నుండి కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 25వ తేదీ వరకు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టామని ప్రజా సంఘాల నాయకులు తెలియజేశారు. తిరుపతి జిల్లాలో ఏడు నియోజకవర్గాలు పుత్తూరు మున్సిపాలిటీ వడమాల పేట మండలాల్లో నిర్వహించాల్సిన ప్రచార కార్యక్రమానికి ఈనెల ఆరవ తేదీన జరిగిన సన్నాహక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేశామని అందులో భాగంగా వేలాది కరపత్రాల ముద్రణ పూర్తయిందని, మండలాల్లో ఉన్న ప్రజా సంఘాల నాయకులతో మండల పరిధిలోని నియోజకవర్గ పరిధిలోను ఇంటింటికి కరపత్ర పంపిణీకి ప్రజాసంఘాల నాయకత్వం సిద్ధంగా ఉందని అందులో భాగంగా ఈనెల 15వ తేదీ నుండి 20వ తేదీ వరకు దళాలుగా బైకులలో ఆ గ్రామాలకు చేరుకోవడం చిన్నపాటి మీటింగ్‌లు ఏర్పాటు చేయడం, ఇంటింటికి కరపత్రాన్ని పంపిణీ చేయడానికి కార్యకర్తలను సన్నద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఇంటికి వెళ్లి కార్యకర్తలు చెప్పడం జరుగుతుంది. ఆ సందర్భంగా ఆ గ్రామాలలో మీటింగులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేసేటువంటి కార్యక్రమం 26వ తారీకున తిరుపతి జిల్లాలో జరిగే మహా ధర్నా కార్యక్రమానికి ఆహ్వానించడం జరుగుతుందని అందుకు యావత్తు ప్రజా సంఘాల నాయకులను సన్నద్ధం అయ్యారని వారు తెలిపారు. 26వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో జిల్లా రైతాంగం కార్మిక వర్గం ప్రజా సంఘాలు విద్యార్థి యువజన మహిళా దళిత కళారూపాలతో కళాకారులు మేధావులు అందరూ కదలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాము అని అన్నారు.

పశు వైద్య కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: గరివిడి పశు వైద్య కళాశాల సమస్యలను పరిష్కరించాలని వెటర్నటీ వైస్ ఛాన్సలర్ గారికి వినత పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి మాట్లాడుతూ విజయనగరం జిల్లా గరివిడిలో ఉన్న పశు వైద్య కళాశాల 70 మంది విద్యార్థులు జీవితాలను కాపాడాలని మాట్లాడారు. విసిఐ అనుమతి వచ్చేలా కృషి చేయాలని ల్యాబ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి పెండింగ్ లో ఉన్న నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. ఈ నెలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం కళాశాలకు రానున్న సందర్భంలో సమస్యలు పెట్టుకొని అనుమతి ఇస్తారా లేదా అనే సందర్భంలో విద్యార్థులు భయపడుతున్నారని కావున వెంటనే పశు వైద్యశాల విద్యార్థుల సమస్యల పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమం జిల్లా కార్యదర్శి ప్రవీణ్, నగర అధ్యక్షులు హరికృష్ణ, నగర సహాయ కార్యదర్శులు చంద్ర నాయక్, ఉపాధ్యక్షులు మోహన్, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై కమిషనర్ సమీక్ష

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన పేదల కోసం నిర్మిస్తున్న గృహాల పురోగతిపై కమిషనర్ ఎన్.మౌర్య గృహ నిర్మాణ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న గృహ నిర్మాణ, నగరపాలక సంస్థ అధికారులు ఆరు లేఔట్లలో నిర్మాణంలో ఉన్న గృహాల పురోగతిని కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన పేదలకు ఇచ్చిన ఇండ్ల నిర్మాణలో పెండింగ్ ఉన్న వాటి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లే ఔట్లలో మౌళిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆమరయ్య, గృహ నిర్మాణ శాఖ డి.ఈ.లు శ్రీనివాస రావు, మోహన్, ఏ.ఈ.లు, హౌసింగ్ స్పెషలిస్ట్ కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం

- మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి దర్శనం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో బుధవారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ ఝామున 4.30 నుండి 5.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివా సమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులను కటాక్షిం చారు. అక్కడక్కడా చిరు జల్లులుల కురవడంతో ఘటా టోపం లోపల స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాస మూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం స్వామి, అమ్మ వార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రాశస్త్యం పురాణాల ప్రకారం శ్రీ వైష్ణవ క్షేత్రాల్లో నిర్వహించే ముఖ్యమైన పర్వదినాల్లో కైశికద్వాదశి ఒకటి. శ్రీ వరాహ పెరుమాళ్ కైశికపురాణంలోని 82 శ్లోకాలతో శ్రీ భూదేవికి కథగా చెప్పిన రోజును కైశిక ఏకాదశిగా పిలుస్తారు. ఈ కథ ఆధారంగా కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది. నంబదువాన్ కథ కైశికద్వాదశి పురాణ నేపథ్యం విశేష ఘట్టాలతో కూడుకున్నది. శ్రీనంబదువాన్ (సత్యమూర్తి) అనే భక్తుడు స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించడానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఒక బ్రహ్మరాక్షసుడు తారసపడి తినేస్తానన్నాడు. తాను శ్రీవారికి సంకీర్తనార్చన చేయడానికి వెళుతున్నానని తప్పక తిరిగివచ్చి ఆ బ్రహ్మరాక్షసుని క్షుద్బాధను తీరుస్తానని నంబదువాన్ ప్రమాణం చేశాడు. అన్న ప్రకారం స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించి బ్రహ్మరాక్షసుని చెంతకు వచ్చాడు. భక్త నంబదువాన్ భక్తికి, సత్యనిరతికి ముగ్ధుడై స్వామివారు మోక్షం ప్రసాదించారు. ఈ విధంగా ఉత్తానద్వాదశికి కైశికద్వాదశి అనే నామకరణం కలిగింది. ఈ కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అడిష నల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేలపట్టులో ట్రైనీ కలెక్టర్ల బృందం

విశాలాంధ్ర-దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో బుధవారం ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యాటించింది. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న 9 మంది ట్రైనీ కలెక్టర్లు కేంద్రంలో విడిది చేసి ఉన్న విదేశీ విహంగాలను తిలకిం చారు. అనంతరం అక్కడ స్థితిగతులను పరిశీలించారు. ఈ ట్రైనీ కలెక్టర్ల బృందం శిక్షాణాలో భాగంగా జిల్లా సమస్యలను, స్థితిగ తులపై తెలుసుకుంటున్నారు. వీరితోపాటు తహసీల్దారు శైలకుమారి ఉన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

- అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్

విశాలాంధ్ర - గూడూరు: జిల్లాల విభజన జరిగినప్పుడు గూడూరుకు అన్యాయం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం అసెంబ్లీ లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లా డుతూ గూడూరు నెల్లూరు కు 30 కిమి ల దూరంలో ఉందని , తిరుపతి 92 కిమీ ల దూరంలో ఉందని తెలిపారు. గూడూరు ను గత వైసిపి పాలకులు తిరుపతి లో కలిపారు అని తెలిపారు. ఉద్యోగులు , ప్రజలు తిరుపతికి వెళ్ళడానికి ఇబ్బం దులు పడుతున్నారు అని పేర్కొన్నారు. యువ గళం పాదయాత్రలో మంత్రి లోకేష్ బాబును గూడూరు ను నెల్లూరు లో కలపామని కోరామన్నారు .అదేవిధంగా సిఎం చంద్ర బాబు నాయుడు గూడూరు లో మహిళల ముఖ ముఖి కార్యక్రమం లో గూడూరు ను నెల్లూరు లో కలుపుతామని హామీ ఇచ్చారు అని పేర్కొన్నారు. త్వరిత గతిన ఈ ప్రక్రియ చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

వైసీపీ వల్లే..ఏపిలో మానవ హక్కుల ఉల్లంఘన

పనిచేసే ప్రభుత్వంపై బురదజల్లడం వైసీపీకి తగదు : చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

విశాలాంధ్ర -చిత్తూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న చట్ట వ్యతిరేక విధానాల వల్లే ఆంధ్రప్రదేశ్లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు ఒక ప్రకటనలో తెలిపారు.రాజ్యాంగాన్ని అనుసరించి, ప్రజా స్వామ్య బద్ధంగా చట్టాలకు లోబడే ఎన్డీఏ సర్కార్ పనిచేస్తుందని పేర్కొ న్నారు. అటువంటి పనిచేసే ప్రభుత్వం పై బురదజల్లడం, వైసీపీకి తగదని చిత్తూరు ఎంపి హితవు పలికారు. లఏపీలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపిస్తూ .వైయస్ఆర్‌సీపీ ఎంపీ ల బృందం ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిం చిన నేపథ్యంలో చిత్తూరు ఎంపీ స్పందించారు. కొందరు వైసీపీ నాయ కులు, కార్యకర్తలు అనుసరిస్తున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎందరో అభాగ్యుల పాలిట శాపంగా మారుతున్నాయని తెలిపారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన కూటమి ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలకు ఉపక్రమించిందని ఆయన తెలిపారు. ఎక్కడా ఎవరినిచ ట్టానికి విరుద్ధంగా నిర్బంధించలేదని ఆయన స్పష్టం చేశారు.ఏపీ డీజీపీ మానవహక్కుల ఉల్లంఘనలని పట్టించుకో వడం లేదని వైసిపి ఎంపీలు వ్యాఖ్యానించడం హాస్యాస్పదమ న్నారు. వైసీపీ కోరుకున్నట్లు. జాతీయ మానవ హక్కుల సంఘం జోక్యం చేసుకుని విచారణ జరిపితే నిజాలు వెలుగులోకి వస్తాయనీ. వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం బయటపడుతుందని తెలిపారు.